క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా వేయి కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధికి దోహదపడాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ ఓ ప్రకటనలో కోరారు. 15 శాతం ఆస్తి పన్ను పెంచే జీవోలను రద్దు చేయాలను సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాలకుల నిర్లక్ష్యంతో నగర పాలన పడకేస్తోందని, కుర్చీల కుమ్ములాటలో నగరపాలక జనరల్ బాడీ సమావేశాల్లో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించారన్నారు. ఇప్పుడు నగర ప్రజల సమస్యలను చర్చించేందుకు సమావేశాలే జరపని దౌర్భాగ్య పరిస్థితి ఉండడం దారుణమన్నారు.

మెగా వైద్య శిబిరం


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కడప కల్చరల్: కడప నగరంలోని పెద్ద దర్గా వద్ద ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఫసిహ క్లినిక్ సహకారంతో అమీనియా బ్లడ్ హెల్ప్‌లైన్, అమీన్ పీర్ దర్గా ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా తరలివచ్చారు. వైద్య సిబ్బంది ఉచితంగా కంటి పరీక్ష, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడప నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొని కిడ్నీ సమస్యలు, గర్భిణుల సమస్యలు, పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలపై బాధితులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, శ్రీతేజ, పి.సుకుమార్, సోహెల్‌మాలిక్, షేక్ రియాజుద్దీన్, దర్గా ప్రతినిధులు పాల్గొన్నారు.

కూడళ్లలో నాయకుల పేర్లు రాయించండి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని వివిధ కూడళ్లలో పలువురు నాయకుల విగ్రహాలను ఏర్పాటుచేసినా.. వారి పేర్లు రాయించలేదని జిల్లా న్యాయసేవా సాధికార సంస సభ్యులు జానుమద్ది విజయ్‌భాస్కర్ అన్నారు. కడపలో నాయకుల విగ్రహాలను ఏళ్ల కిందట ఏర్పాటు చేశారని, పొట్టిశ్రీరాములు కూడలి మినహా ఇంగ్లీషు, తెలుగు భాషల్లో ఎక్కడా పేర్లు రాయించలేదన్నారు. అలా రాయిస్తే వారికి తగిన గౌరవం ఇచ్చినట్లు అవుతుందని తెలిపారు. కౌన్సిల్ ఆమోదం తర్వాతయినా పొందవచ్చని, మొదట కూడళ్లలో పేర్లు రాయించేందుకు మేయర్ సురేష్ బాబు, కమిషనర్ మనోజ్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు.

కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

కమలాపురం: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బీఈడీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా బీఈడీ కళాశాలలన్నీ యూనివర్శిటీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. కాలేజీల్లో స్టాఫ్ ఉండరని, కనీసం ల్యాబ్‌లు కూడా ఉండవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బయటి రాష్ట్రాల నుంచి అడ్మిషన్లు నిర్వహించుకుంటూ వేల రుపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సందడే...సందడి


నృత్యం చేస్తున్న యువతులు

కడప కల్చరల్: వారాంతపు ఆటవిడుపు లో భాగంగా కడప శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కళా వేదికపై మిస్సా మూవీ సహకారంతో జరిగిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కడప నగరానికి చెందిన కిషోర్ డాన్స్ అకాడమీ వారి జానపద, శాస్త్రీయ, సినీ పాటల నృత్యాలు అలరించాయి. శిల్పారామం పరిపాలన అధికారి ఎస్.కృష్ణ ప్రసాద్, మధుసూదన్‌బాబు పర్యవేక్షించారు.

నేడు బుద్ధ జయంతి

కడప కల్చరల్: బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం బుద్ధ జయంతి నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు పిల్లా కుమార్‌స్వామి, కార్యదర్శి లెనిన్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు మల్లెల భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. కడప ఓల్డ్ రిమ్స్ లో సోమవారం ఉదయం 8.30 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుద్ధ ప్రేమికులు, మానవతా వాదులు, రచయితలు పాల్గొనాలని కోరారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



నరసింహస్వామి

కడప రూరల్ : కడప నగర సమీపం ఆలంఖాన్‌పల్లెలోని శ్రీ పెనుసిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5 గంటలకు అభిషేకం, 8 గంటలకు కల్యాణ మహోత్సవం, అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని కార్యనిర్వాహకులు తెలిపారు.

సంఘం శరణం గచ్ఛామి

నేడు గౌతమబుద్ధుడి జయంతి


బుద్ధుడి విగ్రహం


అడపూరు గుట్టపై బౌద్ధ స్థూపాలు

దేశం శాంతికి నిలయం. రణాలు రాజ్యమేలిన ఆనాడే దేశంలో శాంతి దూత ఉదయించాడు. రణం కాదు...బౌద్ధమే శరణం... అనిపించాడు. ప్రపంచానికి శాంతిమంత్రం అందించాడు. ఆత్మ జ్ఞానం ద్వారా సకల మానవాళి శ్రేయస్సును కాంక్షించాడు. నేడు గౌతమబుద్ధుడి జయంతి. ఈ సందర్భంగా జిల్లాలో విలసిల్లిన బౌద్ధం గురించి ప్రత్యేక కథనం.

కడప కల్చరల్: జిల్లాలో రెండవ శతాబ్దం నుంచి బౌద్ధం గొప్ప వైభవాన్ని చూసినట్లు ఆధారాలున్నాయని పరిశోధకులు పేర్కొంటున్నారు. దేశంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు బౌద్ధమత వారధిగా కడప జిల్లా ఉండేదని, నాలుగో శతాబ్దం వరకు ఆ వైభవం కొనసాగిందని చెబుతున్నారు. ఈ ప్రాంతంలోని ప్రజలకు జ్ఞానం బోధిస్తూ ధ్యానంతో గడిపేవారని, ఊరి బయట గుహల్లో నివసించేవారని తెలుపుతున్నారు. నందలూరులోని అడపూరు గుట్టపై 1912లో బ్రిటీషు పురావస్తు పరిశోధకులు ఎఎం.లాంగ్ హరిస్ట్ బౌద్ధ స్థూపాలను కనుగొన్నాడు. 1978లో జరిగిన తవ్వకాలలో నాణేలు, బుద్ధుడి పాదాలు తదితరాలు బయల్పడ్డాయి. ఈ గుట్టపై బయటపడిన స్థూపాలలో ప్రస్తుతం 13 మాత్రమే మిగిలి ఉన్నాయి. తవ్వకాలలో బుద్ధుని పాదాలు, పద్మ పలకాన్ని కడప నగరంలోని మహావీర్ మ్యూజియంకు చేర్చారు. గుట్టపైన, ఆ పరిసర ప్రాంతాల్లో తవ్వకాలు జరిపితే శిథిలాలు బయల్పడే అవకాశముందని పరిశోధకులు తెలిపారు..

ఖాజీపేటలో

ఖాజీపేటలోని నాగనాథేశ్వరస్వామి ఆలయ సమీపంలో బౌద్ధ శిథిలాలను పరిశోధకులు కనుగొన్నారు. జమ్మల మడుగుకు చెందిన ఏనుగుల రామకృష్ణారెడ్డి, మైదుకూరుకు చెందిన యువ పరిశోధకులు తవ్వా ఓబుల్‌రెడ్డి ఆ కొండపైనగల బౌద్ధ అవశేషాలు, నేలమాళిగ, సమీపంలోని పుల్లూరు వద్ద అమరావతిలో లభించిన బుద్ధుడి పాదాల కంటే పెద్దవైన పాదాలను కనుగొన్నారు. అప్పట్లో ఓబుల్‌రెడ్డి మరింత పరిశోధన చేసి ఆ ప్రాంతాలలో అప్పటి శిథిలాలు, భారీ సైజ్ ఇటుకలు కనుగొన్నారు. నాగనాథేశ్వరకొండపై నేలమాళిగలో బౌద్ధ బిక్షువులు నివసించినట్లు వారు విశ్వసిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి అదే విషయాన్ని స్పష్టం చేశారు. ఆ శిథిలాలు క్రీ.శ.2, 3 శతాబ్దాల నాటివిగా అంచనా వేశారు. చుట్టుప్రక్కల తవ్వకాలు సాగిస్తే మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉందంటున్నారు. అంతకుమించిన బుద్ధ స్థూపాలు, పాదాలు, పద్మ పలకాలు, నేల మాళిగలు ఈ ప్రాంతంలో ఉండేవని, గుప్త నిధుల తవ్వకాల కోసం వాటిని ధ్వంసం చేసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బౌద్ధ ఉపాసకులు జమ్మలమడుగు వాసి ఏనుగుల రామకృష్ణారెడ్డి జిల్లాలో బౌద్ధం గురించి విశేషంగా కృషి చేశారు.


బుద్ధుడి పాదాలు

కొండూరు గుట్టపై

జిల్లాలోని రాజంపేట బస్టాండు వద్దగల కొండూరు తిప్పపై కూడా బౌద్ధం అవశేషాలు లభించాయి. భాషా, చరిత్ర పరిశోధకులు విద్వాన్ కట్టా నరసింహులు పరిశోధనల కృషి ఫలితంగా ఆ గుట్టపై 2010లో 18-10-4 అంగుళాల ఇటుకలు, రాయి, ఇటుకలతో నిర్మించిన వర్తులాకార పునాదులు వెలుగు చూశాయి. పురావస్తుశాఖ నిపుణులు ఈమని శివనాగిరెడ్డి పరిశీలించి క్రీస్తు 2 నుంచి ఈ ప్రాంతంలో బౌద్ధం విలసిల్లిందని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపితే శిథిలాలు బయల్పడే అవకాశముందని చెప్పారు.

విస్తృత ప్రచారం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక అభివృద్ధిలో భాగంగా బౌద్ధ పర్యాటకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకు తగినట్లు బౌద్ధం విశేషంగా గల దేశాల నుంచి పెద్ద సంఖ్యలో బౌద్ధ యాత్రికులు దేశానికి వస్తున్నారు. అందులో భాగంగా అడపూరు గుట్టపైగల ఉద్దేశిక స్థూపాల గురించి విస్తృతంగా ప్రచారం చేసి దేశ విదేశాలకు చెందిన బౌద్ధ యాత్రికులను ఆకర్షించాల్సి ఉంది. జిల్లాలోని అన్ని బౌద్ధ ప్రాంతాలను దర్శింపజేసేలా టూరిజం సర్క్యూట్‌ను రూపొందించాలని చారిత్రక అభిమానులు కోరుతున్నారు.

వెంగమాంబ రచనల్లో నైతిక విలువలు


మాట్లాడుతున్న ఈశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్: తరిగొండ వెంగమాంబ రచనల్లో నీతి, భక్తి, నైతిక విలువలు ఎక్కువగా కనిపిస్తాయని యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు నల్లపరెడ్డి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. వెంగమాంబ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతి అన్నమాచార్య కళా మందిరంలో ఆదివారం సాహితీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లపరెడ్డి మాట్లాడుతూ మనసు పవిత్రంగా ఉండేలా చూసుకోవాలని, మనిషిలో భగవంతుడిని చూసుకోవాలనే భావన నృసింహ శతకంలో కనిపిస్తుందన్నారు. పద్మావతీ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డా.వి.కృష్ణవేణి మాట్లాడుతూ తిరుమలలో జీవ సమాధి తరిగొండ వెంగమాంబకే ఉందన్నారు. వెంగమాంబ రాసిన చెంచు నాటకంలో స్త్రీపాత్రనే ప్రధాన పాత్ర పోషించే కథానాయికగా తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో శ్వేత ఇన్‌ఛార్జి సంచాలకులు కె.రాజగోపాలరావు, మునిగోటి వేణుగోపాల్, సంగీతం కేశవులు, శ్రీమతి శ్రీదేవి పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి కల్యాణం


అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యుడు

కడప ఎడ్యుకేషన్: కడప నగర గండ్ల వీధిలోని లక్ష్మీనారాయణస్వామి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. అక్కడికి చేరిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.చెంచురామయ్య, శెట్టిపల్లె లక్ష్మీనరసయ్య, చెంచు రామయ్య, మునికృష్ణ, నాములకుమార్, కిశోర్‌కుమార్, రాఘవేంద్ర, మనోహర్, శివ మెహతా, నవీన్, చైతన్య, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు. చెంచు రామయ్య మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయంలో దాదాపు 75 ఏళ్లుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుపుతున్నామన్నారు.

భారత సైనికుల కోసం ప్రత్యేక పూజలు


సైనికుల కోసం పూజలు చేస్తున్న నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్: ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు దేశ సరిహద్దులో సైనికులు క్షేమంగా ఉండాలని పూజలు చేసినట్లు బీజేవైఎసం నాయకులు తెలపారు. ఆలయ వ్యవస్థాపకుడు కంబగిరి, శంకరాపురం బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి హాజరై కడప ఎన్జీవో కాలనీలో గంగమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బత్తల పవన్‌కుమార్, బొమ్మన విజయ్, సుబ్బారెడ్డి, ప్రవీణ్ నాయుడు, ఓబుళయ్య, గౌరీశంకర్, చిట్టి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమాంబ తిరునాల

సిద్దవటం: మండలంలోని మాచుపల్లె గ్రామంలో పెన్నానది ఒడ్డున వెలసిన శ్రీ రేణుకా యల్లమాంబ తిరునాల సోమవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు నిర్వహిస్తామని గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం తెల్లవారు జామున అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 13వ తేదీ మంగళవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు,14వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ రేణుకా యల్లమ్మ కల్యాణ మహోత్సవం, కోలాటం భజనలు, నిర్వహిస్తామన్నారు. 15వ తేదీ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కు బడులు చెల్లించుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మొదటి బహుమతి రూ. 1,00,116, రెండవ బహుమతి రూ. 70,116, మూడవ బహుమతి రూ. 50,116, నాల్గవ బహుమతి రూ. 30,116, ఐదవ బహుమతి రూ. 20,116 ఇస్తామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


2001 వ సంవత్సరం పూర్వ విద్యార్థులు

కడప కోటిరెడ్డి సర్కిల్: సీకె.దిన్నె మండలం మామిళ్ళపల్లెలోని సెవెంత్ డే అడ్వాంటిస్ట్ స్కూల్లో ఆదివారం 2001వ సంవత్సరపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. స్కూల్ ప్రాంతమంతా కలియదిరుగుతూ తమ ఆడుకునే ఆట స్థలంలో చిన్నపిల్లలుగా మారి మాట్లాడుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. అంతేగాక తమకు చదువు చెప్పినటువంటి టీచర్స్ కీర్తి సుజాత సుభాషిణి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్యాంసన్, ఎలిసా ప్రజల రాంబాబు డైరెక్టర్లు ప్రకాష్ జాన్లు పాల్గొన్నారు.

విద్యార్థుల గెట్ టుగెదర్


గెట్ టుగెదర్‌లో పాల్గొన్న 1988లో పది చదివిన పూర్వ విద్యార్థులు

పెండ్లిమర్రి/కడప కోటిరెడ్డి సర్కిల్: నంది మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1988 పది చ దివిన విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దాదాపు వందమందికి పైగా విద్యార్థులు తమ యొక్క అనుభవాలను ఒకరికొకరు పంచుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు అందరూ ఉన్నత స్థానాల్లో ఉండడం విశేష ఎవరు ఎక్కడ ఏమి పని చేస్తున్నారు. ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రోడ్డుపైకి బండ్లు.. పాదచారులకు ఇక్కట్లు



రాజీవ్ పార్కు ఎదుట నిలిపిన తోపుడు బండ్లు

కడప కార్పొరేషన్: నగర వాసులు ఆహ్లాదంగా గడిపేందుకు వదిలిన స్థలంలో బంకులు, తోపుడు బండ్లు చేరిపోయాయి. పాదచారులు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. కడప నగరపాలక సంస్థ పరిధిలోని రాజీవ్ పార్కు ఎదుట కొంత స్థలం సాయం వదిలారు. అక్కడ తాజాగా బంకులు, తోపుడు బండ్లు చేరాయి. గతంలో సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకే ఇక్కడ ఉంచేందుకు అనుమతి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్కు ఎదుట బంకులు, తోపుడు బండ్లు పెట్టి ఆక్రమించేశారు. నగరపాలక సంస్థకు పన్ను చెల్లించకుండా, అనుమతి లేకుండా ఇలా ఇష్టానుసారం ఆక్రమించేశారు. పార్కుకు ఉపయోగించే విద్యుత్తు కొందరు వాడుకుంటున్నారు. ఎలాంటి పన్నులు చెల్లించకపోయినా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఆహార పదార్థాల తయారీలో నూనెలు కాచి అక్కడే పడేయడంతో అపరిశుభ్రంగా మారుతోంది. పైగా వాహనదారులు జారి పడుతున్నారు. ఏడాది కాలపరిమితితో వాటిని ఏర్పాటు చేశారు. కాలపరిమితి పూర్తయినా అలాగే కొనసాగుతున్నారని స్థానిక కార్పొరేటర్ ఫిర్యాదు చేసినప్పటికీ కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా స్పందించి కొత్తగా టెండర్లు పిలిచి... సాయంత్రం నుంచి రాత్రి వరకే తోపుడు బండ్లు, ఇతర వ్యాపార దుకాణాలకు అనుమతివ్వాలని కోరుతున్నారు.

కార్పొరేట్ లాభాల కోసమే నాలుగు లేబర్ కోడ్లు


మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి


కడప వైఎస్ఆర్ సర్కిల్: కార్పొరేట్ సంస్థల లాభాల కోసం తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్.నాగసుబ్బారెడ్డి, బి.మనోహర్ డిమాండ్ చేశారు. పేర్కొన్నారు. కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఉగ్రవాదుల దాడుల్లో అశువులు బాసిన జవాన్లకు నివాళులర్పించి జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. బ్రిటీష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను రూపుమాపి మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోట్లు తెచ్చిందని విమర్శించారు. దీంతో కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను సమ్మె ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో బ్యాంకింగ్, ఎల్ఐసీ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్, కేసీ.బాదుల్లా, ఎంవీ.సుబ్బారెడ్డి, దస్తగిరిరెడ్డి, బాబ్జి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

పుట్లంపల్లి అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నాయకుల

కడప వైఎస్సార్ సర్కిల్: కడప నగరంలోని పుట్లంపల్లెఅభివృద్ధిపై నిర్లక్ష్యం తగదని సీపీఎం కడప నగర కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. పుట్లంపల్లెలో ఆదివారం సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్లంపల్లె పంచాయతీని కార్పొరేషన్‌లో విలీనం చేస్తే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఏళ్లు గడచినా పన్నుల భారం పెరిగిందేగానీ, అభివృద్ధి ఛాయలు కనపడలేదన్నారు. ప్రభుత్వ పాఠశాల, సచివాలయాన్ని మూసివేశారని, కనీసం అంగన్వాడీ కేంద్రం లేదన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోందని, ఆ ప్రాంత ప్రజలు జబ్బుల బారిన పడుతున్నారని అన్నారు. చిన్నచౌక్ నుంచి పుట్లంపల్లికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, ఆటోలు కూడా ఆ ప్రాంతానికి రావడం లేదన్నారు. రహదారి అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, కుమారస్వామిరెడ్డి, గోవిందు, నరసింహ, ప్రవీణ్‌కుమార్, ఓబుల్‌రెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణం


విజయదుర్గ


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్: కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేద మంత్రోక్తంగా మంగళ వాయిద్యాల మధ్య విజయదుర్గాదేవి, మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులను అలంకరించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, దుర్గా ప్రసాదరావు తొలి పూజ జరిపారు. అనంతరం కల్యాణం జరిపి ఆలయ మర్యాదలతో అమ్మవారి విశేష వస్త్రాలను, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు.

నేడు విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ ధర్నా


సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్: పాఠశాలల పునఃవ్యవస్థీకరణ, బదిలీలు, పదోన్నతుల సమస్యల పరిష్కారంకోసం విద్యాశాఖ అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ సోమవారం డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో ప్రతి వారం విద్యా శాఖ అధికారులు సమావేశమై చర్చిస్తున్నారన్నారు. సమస్యలపై విద్యాశాఖాధికారులు స్పందించకుండా, ఏకపక్షంగా చేపడుతున్న చర్యలతో విద్యా రంగం నష్టపోతోందన్నారు. విద్యా రంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా ప్రవర్తించడం తగదన్నారు. వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లీషు సర్ప్లస్ అవుతున్నాయన్నారు. ఉన్నత పాఠశాలల్లో 46మంది విద్యార్థులు ఉంటే 2వ సెక్షన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజాస్ అహమ్మద్, గోపీనాథ్, రామకేశవ, ప్రకాష్ బాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేయినూతల క్షేత్రంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతలకోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్, వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, వేదపారాయణం, మహమంగళహారతి, సాయంత్రం హనుమత్ వాహన సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కొనేర్లల్లో స్నానాలు అచరించి స్వామివారికి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు సూర్యప్రభ వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహన సేవ, శ్రీచక్ర పెరుమాళ్ సేవ, ఉంజల్‌సేవ, రాత్రికి గరుడసేవ నిర్వహిస్తామన్నారు. ఎద్దులచే బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా నరసింహస్వామి జయంతి


గ్రామోత్సవంలో కోలాట ప్రదర్శన

వల్లూరు : పడమట వీధిలో వెలసిన శ్రీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలను, విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారి చిత్ర పటాన్ని ట్రాక్టర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులను చేసి డప్పు వాయిద్యాల నడుమ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవం వెంట సాగిన కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

శేషవాహనంపై విహరించిన మోక్షనారాయణుడు


హోమాలు చేస్తున్న సాయినాథ శర్మ దంపతులు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన మోక్షనారాయణుడు శేషవాహనంపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న మోక్షనారాయణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఉదయం అభిషేకాలు, మండల ఆరాధన, అరుణ పారాయణం నిర్వహించారు. సాయంత్రం వివిధ రకాల హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్షనారాయణుడు శేష వాహనంపై, శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు అశ్వ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగి భక్తులకు నయనానందం కలిగించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

సిద్దవటం: మండలంలోని జేఎంజే కళాశాలకు ఎదురుగా ఉన్న శ్రీ పెంచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం లక్ష్మీదేవి, చెంచులక్ష్మి సమేత నరసింహ స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనరసింహ సహస్రనామావళి, దీక్షా హోమం, తీర్థ ప్రసాదాల వినియోగం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి ఒంటిమిట్ట కళాకారులతో కోలాటం, చెక్క భజనలు నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని దొడ్డపనేని చంద్రశేఖర్ నాయుడు తెలిపారు.